విజయం మాదే

- సంక్షేమమే గెలుపునకు నాంది
- కేసీఆర్‌కు హ్యాట్రిక్ ఖాయం
- విద్యానిలయంగా మహేశ్వరం
- మంత్రి సబితారెడ్డి
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

మహేశ్వరం: వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనని మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి తెల్పిచెప్పారు. మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక పెన్షన్లను రూ.5 వేలకు, ద్వివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని తెలిపారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా మహేశ్వరంలో తన విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. మహేశ్వరం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, డైట్, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ అదనపు గదుల నిర్మాణం, హాస్టల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు ఏర్పాటు చేసి.. ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి తగిన గుర్తింపు ఇచ్చి గౌరవిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లూరు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంద కుమార్, మండల బీఆర్ఎస్ ఎస్సీసెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందుపల్లి కుమార్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, హరిశంకర్, సంజయ్, ప్రేమ్‌రాజ్ గౌడ్, శివకుమార్ పలువురు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న జంగారెడ్డి తదితరులు

సబితారెడ్డిని గెలిపించండి..

కారు గుర్తుకు ఓటు వేసి సబితారెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సబితారెడ్డి మద్దతుగా ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి ప్రత్యేక చొరవతో మహేశ్వరానికి వందల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య పలువురు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

కందుకూరు: మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం మండల పరిధిలోని పులిమామిడిలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పులిమామిడి, దావూద్‌గూడ, బంజరుగడ్డతండా, మురళీనగర్‌లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సబితారెడ్డి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సురేశ్, ఎస్సీ, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సాయిలు, లచ్చానాయక్, సీనియర్ నాయకులు ఎ.పాండుగౌడ్, ఎ.దామోదర్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంద సాయిలు, సుమన్‌నాయక్, శ్రీదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి.పాండు, యూత్ నాయకులు డిల్లీ శ్రీధర్, కాకి రవీందర్, బొక్క దీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు చౌరస్తాలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాములు, ప్రశాంత్‌చారి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివ, జంగయ్య, వెంకటేశ్, హన్మంత్‌రెడ్డి, ఉదయ్, రాజిరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కారు జోరు..

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో కారు ప్రచార హోరు ఊపందుకుంది. 30వ డివిజన్‌లోని అరవబస్తీ (తమిళ్‌బస్తీ)లో స్థానిక కార్పొరేటర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బస్తీని అభివృద్ధి చేసిన మంత్రి సబితారెడ్డికి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, బాబు, దానియల్, నరహరిగౌడ్ తదితరులున్నారు.

ఇంటికి పంపుతాం

- మంత్రి సబితారెడ్డిని చిత్తుగా ఓడిస్తాం
- మహేశ్వరంలో మాదే గెలుపు
- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి
- నామినేషన్ దాఖలు చేసిన కేఎల్ఆర్


సభలో ప్రసంగిస్తున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ తీవ్రతరం కావడంతో ఇరుపార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన మంత్రి సబితారెడ్డిని చిత్తుగా ఓడించాలని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో రిటర్నింగ్ కార్యాలయంలో తుక్కుగూడ నుంచి తన అనుచరులతో కలిసి భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సబితారెడ్డి 2018 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి, డబ్బుల కోసం కన్న తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్లారని ధ్వజమెత్తారు. అప్పటికే ఆ పార్టీలో కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి రాజకీయ భవిష్యత్తును దెబ్బతీశారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతుభరోసా ద్వారా రైతులకు రూ.15వేలు పెట్టుబడి సాయం, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థికసాయం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. మహేశ్వరంలో కాంగ్రెస్ బలంగా ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని తేల్చిచెప్పారు. సబితారెడ్డిని చిత్తుగా ఓడించి ఇంటికి పంపుతామని స్పష్టం చేశారు.

ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో లక్ష్మారెడ్డి దంపతులు, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఆశీస్సులు తీసుకుని నేరుగా నామినేషన్ వేసేందుకు వెళ్లారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మళ్లీ ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, కోరుపోలు రఘుమారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి, బోధ మాధవరెడ్డి, మహేశ్వరం, కందుకూరు, మీర్‌పేట్ మండలాల అధ్యక్షులు కాకి ఈశ్వర్, ఎస్. కృష్ణానాయక్, గోపాల్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎల్ఆర్‌కు మద్దతుగా..

కందుకూరు: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్ఆర్ నామినేషన్ వేసే కార్యక్రమానికి మండల పరిధి నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

యాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సందీప్‌కుమార్

యాచారం: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ రైతులకు సూచించారు. యాచారం మండల కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని తెలిపారు. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ గ్రేడ్ క్వింటాల్‌కు రూ.2,183 అని తెలిపారు. ధాన్యం విక్రయించిన వారం, పక్షం రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల్: మండల కేంద్రంలో మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. యాదవ కులసంఘం నాయకులు రాములుయాదవ్, యాదయ్యయాదవ్, యాదయ్య, సత్యంయాదవ్, అంజయ్యయాదవ్, పాండుయాదవ్, మల్లయ్య, చెన్నయ్య, మల్లేశ్ ఉన్నారు.

కళాకారులకు సత్కారం



సన్మానం అందుకున్న నాటక రంగ కళాకారులు

వనస్థలిపురం: కళల కాణాచి, తెనాలి, వేద గాయత్రి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వీణా అవార్డ్స్ పద్య పౌరాణిక నాటక పోటీలలో శ్రీకళానికేతన్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన వసంత రాజీయం ఉత్తమ ప్రదర్శన ప్రథమ స్థానంలో నిలిచి బంగారు వీణతో పాటు రూ. లక్ష నగదు బహుమతి పొందింది. ఈ సందర్భంగా శ్రీకళానికేతన్ ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో నాటకంలో పాల్గొన్న కళాకారులను ఘనంగా సన్మానించారు. శ్రీకళానికేతన్ అధ్యక్షుడు లయన్ సాధు శ్యాం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తడకమళ్ల రామచంద్రరావు, మారంరాజు రామచంద్రరావు, బాపనపల్లి పరమేష్, సురభి వెంగమాంబ, డాక్టర్ శ్రీజ సాధినేని, దారు వీణ, సోమా అంజిరెడ్డి, హరినాథ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12 నుంచి సిద్ధేశ్వరానంద భారతిస్వామి పర్యటన



దిల్‌సుఖ్‌నగర్: కుర్తాళం పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆర్‌కే పురంలోని శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో నవంబర్ 12 నుంచి 18 వరకు అందుబాటులో ఉంటారని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజుల్లో ఉదయం 11 నుంచి 1 గంట వరకు భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు. భారతి స్వామివారి దివ్య సన్నిధిలో దీపావళి వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు సెల్ 8977788066 లో సంప్రదించవచ్చన్నారు.

ఇంటర్నేషనల్ టార్గెట్ బాల్ పోటీలకు ఎంపిక


శ్రీనిఖను అభినందిస్తున్న పల్లవి స్కూల్ యాజమాన్యం

లింగోజిగూడ: నేపాల్‌లోని ఖాట్మండ్‌లో డిసెంబర్‌లో జరగనున్న అంతర్జాతీయ జూనియర్ టార్గెట్ బాల్ ప్రెసిడెంట్ కప్ 2023-2024లో పోటీలలో ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వీరమల్ల శ్రీనిఖ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నది. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొమరయ్య, డైరెక్టర్ అనితారెడ్డి, పీఈటీ సందీప్‌కుమార్‌లు శ్రీనిఖను అభినందించారు.

శుభ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వనస్థలిపురం: దీపావళి పండుగ సందర్భంగా ఎల్‌బీ నగర్‌లోని శుభ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 30 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు డాక్టర్ సి.స్రవంతిరెడ్డి తెలిపారు. అత్యాధునిక సంతానోత్పత్తి చికిత్సలు తమ ప్రత్యేకతని, ఉచిత వైద్య శిబిరం సందర్భంగా ఉచిత కన్సల్టేషన్, రిజిస్ట్రేషన్, సెమెన్ అనాలసిస్‌పై 25 శాతం తగ్గింపు, ఐయూఐపై 50 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ స్రవంతిరెడ్డి కోరారు.

మద్యం పట్టివేత

హయత్‌నగర్: హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు హయత్‌నగర్‌లోని పలు రహదారులపై బుధవారం నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.78వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఔటర్ రింగురోడ్డు పరిధిలోని కొహెడా, తుర్కయాంజాల్, బ్రాహ్మణపల్లి రహదారుల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో తరలిస్తున్న రూ.77,900 విలువైన 68 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఐదుగురు అభ్యర్థులు.. ఆరు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న జై మహాభారత్ పార్టీ అభ్యర్థి హుమా అబ్బాసి



రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న నర్సింహారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల్లో బుధవారం ఐదుగురు అభ్యర్థులు.. ఆరు నా మినేషన్ సెట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్‌కు అందజేశారు. నామినేషన్ వేసిన వారి లో కాంగ్రెస్ పార్టీ నుంచి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (రెండు సెట్లు), బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డి తరుపున ఆమె మద్దతుదారులు, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ నుంచి నర్సింహారెడ్డి, జై మహాభారత్ పార్టీ నుంచి హుమా అబ్బాసి, స్వతంత్ర అభ్యర్థిగా కనకనల శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేశారు. ప్ర తి అభ్యర్థి ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేయగా.. లక్ష్మారెడ్డి తరుపున ఒక సెట్ ఆయన వేయగా.. మరో సెట్ ఆయన బంధువులు వేశారు. మొత్తం ఐదుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్ సెట్లను దాఖలు చేశారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

- పార్టీ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి


ఆమనగల్లు: కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఆమనగల్లు: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శివలింగం, కృష్ణ, రవి, గోపి, లక్ష్మారెడ్డి, జగన్‌రెడ్డి, చెన్నయ్య, గోపినాయక్, శ్రీనునాయక్, మల్యానాయక్, నర్సిరెడ్డి, యాదిరెడ్డి తదితరులు బుధవారం కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ పర్వతాలు, స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పుల్యానాయక్, బాల్యానా యక్, తిరుమలేశ్, దావిద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో మాధవిరెడ్డి ప్రచారం..

మాడ్గుల: కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారయణరెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి మాధవి రెడ్డి కోరారు. మాడ్గులలో బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మానయ్య, జగన్, కృష్ణనాయక్‌త, అలీం, ఫరీద్, శ్రీకాంత్, శివలింగం తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్‌యూఐ ప్రచారం..

కడ్తాల్: కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని మక్తమాధారం, నాగారెడ్డిగూడలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. కసిరెడ్డిని ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకుడు భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

కేంద్రమంత్రికి సన్మానం


కేంద్రమంత్రిని సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, మహారాష్ట్రలోని కేలాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సందీప్ దుర్వే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి హాజరయ్యారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని దయానంద్‌గౌడ్ నివాసంలో వారిని భారీ పూలమాలతో సత్కరించారు. కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని.. బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామని అన్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురు యువకుల అరెస్ట్

నాగోలు: హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 35,500 విలువైన 220 గ్రాముల గంజాయి, రూ.5500 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా కల్వచెర్ల గ్రామానికి చెందిన ముసలి కౌశిక్‌కుమార్(19) కొన్ని రోజులుగా ఎల్‌బీనగర్ సిరిస్ రోడ్డులోని జేఎంజే హాస్టల్‌లో తన చిన్ననాటి స్నేహితుడు మేడా సాయికిరణ్‌తో కలిసి ఉంటూ స్థానికంగా యానిమేషన్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. కౌశిక్‌కుమార్ ఆరు నెలలుగా మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. కౌశిక్, సాయికిరణ్‌లు కలిసి చార్మినార్‌కు వెళ్లి అక్కడ గంజాయి సరఫరా చేసే మోహ్సిన్ భాయ్ వద్ద గ్రాము గంజాయిని రూ. 4 వేలకు కొనుగోలు చేసి ఎల్‌బీనగర్‌లోని హాస్టల్‌కు తెస్తున్నారు. చార్మినార్‌లో వీరికి నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో రుదావత్ గోపి, అనర్జిత్ చౌపాల్‌లతో పరిచయం ఏర్పడింది. అందరూ కలిసి స్నేహితులుగా మారారు. దీంతో అందరూ కలిసి హాస్టల్ భవనం కింద గంజాయి తాగాలని నిర్ణయించుకొని చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయిని నింపారు. నలుగురూ మంగళవారం రాత్రి హాస్టల్‌లో గంజాయి తాగుతుండగా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ డీఐ వీరస్వామి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 220 గ్రాములు గంజాయి, రూ. 5,500లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరా చేసే మోహ్సిన్ భాయ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

నేడు ఊపందుకోనున్న నామినేషన్లు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారంతో నామినేషన్ గడువు ముగుస్తుండటంతో గురువారం నామినేషన్లు ఊపందుకోనున్నాయి. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పటి వరకూ నామినేషన్లు దాఖలు చేయలేదు. గురువారం మంచి రోజు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నామినేషన్ వేయనున్నట్లు తెలిసింది. మధుయాష్కీ హయత్‌నగర్ నుంచి కొత్తపేటలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేయనున్నట్టు సమాచారం. కాగా, బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఇప్పటికే రెండుసెట్ల నామినేషన్లను ఎటువంటి హడావుడి లేకుండా దాఖలు చేశారు. అంతేకాక ఈసారి సుమారు 20 మందికి పైగా స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేసే అవకాశం కన్పిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా, ప్రజా ఏక్తా పార్టీ, యుగతులసి పార్టీ, బహుజన లెఫ్ట్ పార్టీ, విద్యార్థుల రాజకీయ పార్టీ, ధర్మసమాజ పార్టీ, తెలంగాణ రిపబ్లికన్ పార్టీల అభ్యర్థులు ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉండబోతున్నారు.

8 నామినేషన్లు దాఖలు

చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఈ నెల 3 నుంచి మంగళవారం వరకు 13 నామినేషన్లు దాఖలు కాగా, బుధవారం మరో 8 నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ తెలిపారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి 3వ సెట్ నామినేషన్ సమర్పించగా, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఈసారి సూర్యప్రకాష్‌రెడ్డి, మంచాల శ్రీకాంత్, మోకురోజు పరిపూర్ణాచారి నామినేషన్ వేశారన్నారు. ఇక విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా కోషిగ అనికేత్, బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా రాయబండి పాండురంగ, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా గోరకంటి వినోద్‌కుమార్, ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా నరేష్ మిద్దెల నామినేషన్ సమర్పించినట్టు తెలిపారు.

కొనసాగుతున్న నామినేషన్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానానికి బుధవారం నలుగురు అభ్యర్థులు ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్ఓ అనంతరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి తరుపున మరో నామినేషన్ వేణుగోపాల్‌రెడ్డి వేశారు. బీజేపీ తరుపున నోముల దయానంద్‌గౌడ్, బీఎస్పీ తరుపున మల్లేష్ రెండుసెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా శంకర్‌రెడ్డి నామినేషన్ వేశారు.

ఫార్మాసిటీని రద్దు చేయిస్తా

- సేకరించిన భూములను రైతులకే ఇచ్చేస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఫార్మాసిటీని రద్దుచేయిస్తానని, సేకరించిన భూములు తిరిగి రైతులకే ఇచ్చేలా కృషి చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో బుధవారం ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి అధ్యక్షతన, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఫార్మాసిటీ భూబాధితులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మల్‌రెడ్డి మాట్లాడారు. ఈ ప్రాంత రైతులు వద్దని వారిస్తున్నా.. బలవంత భూసేకరణ చేసి ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టాలన్నారు. అదే విధంగా నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూములను నాలుగు తరాలుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న కౌలు రైతులకు హక్కులు కల్పించకుండా ఆ భూములను ఫార్మాసిటీకి తీసుకోవడం సిగ్గుచేటని అన్నారు.

బీజేపీ మోసం చేసింది..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని 19,333 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి కేసీఆర్ సర్కార్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటూ ప్రజలను మోసం చేసిందని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని స్వయంగా భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీకి ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. ఫార్మాసిటీకి అన్ని రకాల అనుమతులు కేంద్రమే ఇస్తూ గ్రామాల్లో మాత్రం రైతులను నమ్మించేలా ఆ పార్టీ నేతలు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థికి ఓట్లువేసి గెలిపించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. లేకపోతే కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీని రియల్ వ్యాపార సంస్థగా మార్చుకుంటుందని అన్నారు. ఈ సమావేశంలో పర్యావరణ వేత్త నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీపతిగౌడ్, ఈసీ శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, జ్యోతినాయక్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ శ్రీకాంత్ నాయక్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల సర్పంచ్‌లు రమేశ్, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.